అభివృద్ధి పనులు వేగవంతం

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి


ఆర్టీసీ బస్టాండు నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరులో చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, వచ్చే మార్చి నాటికి పనులన్నీ పూర్తి కానున్నట్లు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. పట్టణంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే రాచమల్లు శనివారం పరిశీలించారు. రామేశ్వరంలోని పెన్నానదిపై రూ. 53 కోట్లతో నిర్మిస్తున్న హైలెవెల్ వంతెనను పరిశీలించారు. వచ్చే ఏడాది మార్చి నాటికి బ్రిడ్జి నిర్మాణం పూర్తి కావాలని సంబంధిత కాంట్రాక్టర్‌తో అన్నారు. బ్రిడ్జి ఏర్పాటు చేయడం వల్ల జగనన్న కాలనీ, ఉక్కు ఫ్యాక్టరీతో పాటు ఆర్టీపీపీ, బెంగళూరులకు వెళ్లేందుకు మార్గం సుగమం అవుతుందని తెలిపారు. రూ. 5 కోట్లతో నిర్మించనున్న ఆర్టీసీ బస్టాండును పరిశీలించారు. ప్రయాణికులకు అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని తెలిపారు. సెప్టెంబర్ ఆఖరు నాటికి నిర్మాణం పూర్తి చేస్తామని కాంట్రాక్టర్ అన్నారు. కూరగాయల మార్కెట్ నిర్మాణ పనులను కూడా పరిశీలించారు. సుమారు రూ. 53 కోట్లతో పనులు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే రూ.165 కోట్ల వ్యయంతో జరుగుతున్న వైఎస్సార్ ఇంజినీరింగ్ కాలేజీ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. మున్సిపల్ కార్యాలయం ఎదురుగా రూ.3.50 కోట్లతో పార్కు పనులు జరుగుతున్నాయని వచ్చే నెల 15 నాటికి పూర్తి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ సానబోయిన శేఖర్‌యాదవ్, జిల్లా తొగటవీర సంఘం అధ్యక్షుడు బండారు సూర్యనారాయణ, ప్రొద్దుటూరు మండల ఇన్‌చార్జి మార్తల ఓబుళరెడ్డి, కౌన్సిలర్లు గరిశపాటి లక్ష్మీదేవి, కమాల్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

21న కొత్త పైప్‌లైన్, ప్రధాన కాల్వల ఆధునీకరణ పనులు ప్రారంభం

ఈ నెల 21న నూతన తాగు నీటి పైప్‌లైన్ మార్పిడి పనులతో పాటు పట్టణంలోని ప్రధాన డ్రైనేజి కాల్వల పనులను ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే రాచమల్లు తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే రాచమల్లు విలేకరులతో మాట్లాడారు. రూ. 120 కోట్లతో అమృత్ పథకాన్ని పూర్తి చేశామని, మరి కొన్ని రోజుల్లోనే నీటిని ప్రజలకు రోజూ అందిస్తామని చెప్పారు. ఎప్పటి నుంచో ప్రజలను పీడిస్తున్న ప్రధాన మురికి నీటి కాల్వల సమస్యకు ముగింపు పలకబోతున్నామని చెప్పారు. 20 ఏళ్లుగా ఈ కాల్వల ఆధునీకరణ జరగలేదన్నారు. అలాగే కానపల్లి వద్ద మురికి నీటిని శుద్ధి చేసి ఆ నీటిని పంట కాల్వలకు పంపించే ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. రూ. 160 కోట్లతో నూతన టెక్నాలజీతో నిర్మాణం చేస్తున్నామని చెప్పారు. ఈ నెల 21న ప్రారంభించి ఏడాదిన్నర లోపు పూర్తి చేసేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. 70 ఏళ్ల క్రితం వేసిన ప్రధాన మంచి నీటి పైప్‌లైన్ స్థానంలో కొత్తగా ఏర్పాటు చేయనున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఇప్పుడు 150 కోట్లతో ఈ నెల 21న పనులు ప్రారంభించనున్నామన్నారు.

క్లుప్తంగా

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో కొలువైన శ్రీలక్ష్మీనరసింహస్వామికి వైశాఖ మాసం నాల్గవ శనివారం సందర్భంగా వేకువజాము నుంచే స్వామి వారికి ప్రత్యేక అభిషేకం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తుల దర్శనార్థం స్వామి వారిని ప్రత్యేక అలంకరణలో ఉంచారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని కాయకర్పూరం సమర్పించుకున్నారు. ఆలయ పూజారి పెంచలయ్యస్వామి ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. వచ్చిన భక్తులకు ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఘనంగా ధ్వజ స్తంభ ప్రతిష్ట


శిఖర కలశాలను ఊరేగిస్తున్న భక్తులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వసంతపేటలోని కోదండరామస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శనివారం నవగ్రహ, వాస్తు, రుద్ర, చండీ హోమాలను నిర్వహించారు. ధ్వజ శిఖర కలశ ప్రతిష్ట మహోత్సవాలు నిర్వహించారు. ఆదివారం ఉదయం 9 నుంచి 10 గంటలలోపు యంత్ర ప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ట, ప్రాణ ప్రతిష్ట, మహా పూర్ణాహుతి, కుంభాభిషేకం, సీతారాముల శాంతి కల్యాణం, మధ్యాహ్నం అన్న ప్రసాద వినియోగం జరుగనుంది. కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని కోదండరస్వామి ఆలయ కమిటీ ప్రతినిధులు కోరారు.

కంటి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : కంటి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని నేత్రవైద్యుడు తేజ పేర్కొన్నారు. స్థానిక జనవిజ్ఞాన వేదిక కార్యాలయంలో సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లో పాల్గొన్న విద్యార్థులకు కంటి వైద్యపరీక్షలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అంధత్వానికి కారణాలు, దృష్టిలోపాలపై అవగాహన కల్పించారు. సకాలంలో కంటివైద్యం అందించడం ద్వారా అంధత్వాన్ని నివారించవచ్చన్నారు. సెల్‌ఫోన్‌ను ఎక్కువగా ఉపయోగించరాదన్నారు. కార్యక్రమంలో జెవీవీ రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, జిల్లా ఆరోగ్యవిభాగం కన్వీనర్ డాక్టర్ చక్రధర్, పట్టణ ప్రధాన కార్యదర్శి సునీత, చరణ్, గురప్ప, అజర్, అక్షయ తదితరులు పాల్గొన్నారు.

రాజీ మార్గమే ఉత్తమం


మాట్లాడుతున్న అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి గాయత్రి

బద్వేలు అర్బన్ : దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులలో కక్షిదారులు తమ కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకోవడం ఉత్తమ మార్గమని, ఇందుకు లోక్ అదాలత్ సహకరిస్తుందని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.కాశీవిశ్వనాథఆచారి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి.గాయత్రి, జుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ సోమేసులశివ ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరిగి సమయం వృథా చేసుకోకుండా కేసులు పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. లోక్ అదాలత్ సందర్భంగా మూడు బెంచిలను ఏర్పాటు చేసి 289 క్రిమినల్ కేసులు, 28 సివిల్ కేసులు చొప్పున మొత్తం 317 కేసులు పరిష్కరించారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ బెంచ్ మెంబర్‌లు, బార్ అసోసియేషన్ న్యాయవాదులు, పోలీసులు పాల్గొన్నారు.

ఆంజనేయుడికి వెండి ఆభరణాల వితరణ


ఆభరణాలను ఆలయానికి తీసుకువస్తున్న సొద్దల గుర్రప్ప దంపతులు

మైదుకూరు : పట్టణంలోని పార్వతి సమేత భీమేశ్వర స్వామి, లక్ష్మీ మాధవరాయ ఆంజనేయస్వామి సమూహ దేవాలయంలో వెలసిన అంజనేయస్వామికి మైదుకూరుకు చెందిన మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ సొద్దల గుర్రప్ప 6.5 కిలోల వెండి ఆభరణాలను చేయించి వితరణ చేశారు. శనివారం ఆలయంలో సమూహ దేవస్థానాల ఈఓ ప్రసాదరావు, చైర్మన్ భూమిరెడ్డి సుబ్బరాయుడు సమక్షంలో సొద్దల గుర్రప్ప, వెంకటసుబ్బమ్మ దంపతులు రూ.5.50 లక్షల విలువైన కవచం, నామాలు, కిరీటం, చేతులు, పాదాలు, నేత్రాలు వంటి ఆభరణాలను అందజేశారు. ఈ సందర్భంగా సొద్దల గుర్రప్ప దంపతులను ఆలయం తరపున ఈఓ, చైర్మన్, సభ్యుడు ఎలిశెట్టి ప్రసాద్ సత్కరించారు. కార్యక్రమంలో దేవస్థానం మాజీ చైర్మన్లు బండి సుబ్బరాయుడు, సింగయ్యగారి రామ్మోహన్, వైఎస్సార్‌సీపీ నాయకులు సొద్దల సురేష్, సింగిల్ విండో మాజీ డైరెక్టర్ సొద్దల కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంప్ సద్వినియోగం చేసుకోండి

పోరుమామిళ్ల : విద్యార్థులు వేసవి సెలవుల్లో గ్రంథాలయంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని రిటైర్డు డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి మార్కారెడ్డి విద్యార్థులకు పిలుపిచ్చారు. శనివారం ఆయన స్థానిక గ్రంథాలయాన్ని సందర్శించారు. అక్కడ కొనసాగుతున్న సమ్మర్ క్యాంప్ విశేషాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనం వల్ల విజ్ఞానం అబ్బుతుందని, విద్యార్థి దశ నుంచే తల్లిదండ్రులు, పెద్దల పట్ల వినయ విధేయతలు, గౌరవం అలవర్చుకోవాలన్నారు. జేవీవీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఖాశింవలి మాట్లాడుతూ ఆదివారం డ్రాయింగ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తామన్నారు. లైబ్రేరియన్ అఫ్రిదీ, దాదాపీర్, మహమ్మద్ రఫీ పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయోత్సవ సంబరాలు

పోరుమామిళ్ల: కర్ణాటకలో కాంగ్రెస్ ఘన విజయం సాధించడంతో పోరుమామిళ్లలో శనివారం ఆ పార్టీ రాష్ట్ర ప్రతినిధి డాక్టర్ అన్వర్ ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలు చేసుకున్నారు. బాణ సంచా కాల్చి, కేక్ కట్ చేసి, జెండాలు ఎగురవేసి నినాదాలు చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ అన్వర్ మాట్లాడుతూ ముందుగా అన్ని సర్వేలు చెప్పినట్లే కాంగ్రెస్ భారీ విజయం సాధించిందన్నారు. అలాగే తెలంగాణ, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో కూడా కాంగ్రెస్ అధికారాన్ని కైవశం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. దేశ వ్యాప్తంగా బీజేపీ మత రాజకీయాలకు ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు.

కర్ణాటక ఫలితాలతో బీజేపీ పతనం మొదలు

పోరుమామిళ్ల: కర్ణాటక ఎన్నికల ఫలితాలతో భారతీయ జనతా పార్టీ పతనం ప్రారంభమైందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరశేఖర్, ఏరియా కార్యదర్శి జకరయ్య, పట్టణ కార్యదర్శి మస్తాన్ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం వారు విలేకరులతో మాట్లాడుతూ మతోన్మాద రాజకీయాలు చేసే ఏ పార్టీని ప్రజలు విశ్వసించరన్నారు. దేశంలో నియంతృత్వ పాలన సాగిస్తూ, వ్యవస్థను నాశనం చేసే పార్టీని కన్నడ ప్రజలు తరిమి కొట్టారన్నారు. మత రాజకీయాలు చేయకుండా ప్రజాస్వామ్య లౌకిక హక్కులను కాపాడుతూ ప్రజలకు న్యాయం చేయకపోతే బీజేపీ అన్ని రాష్ట్రాలలో కనుమరుగవుతుందని హెచ్చరించారు.

గ్రామాల్లో గడప గడపకూ స్పందన


పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

ఖాజీపేట : గ్రామాలకు వెళ్లినప్పుడు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తోందని.. సీఎం జగన్ పాలన పట్ల ప్రజలే ఆదరణే ఇందుకు నిదర్శనమని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా తుడుమలదిన్నె పంచాయతీలో రెండవ రోజున తిమ్మారెడ్డి పల్లె, తుడుమలదిన్నె, దళితవాడలో ఎమ్మెల్యే పర్యటించారు. ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ ఫలాలు అందుకుంటున్న లబ్ధిదారులను కలిసి, పథకాల పట్ల వారి అభిప్రాయాన్ని విన్నారు. మునుపెన్నడూ ఇలాంటి సంక్షేమాన్ని చూడలేదని.. సీఎం జగన్‌కు తాము ఎప్పుడూ రుణపడి ఉంటామని ఎమ్మెల్యేకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధితోపాటు సంక్షేమ ఫలాలను అందిస్తున్నామన్నారు. దీంతో ప్రజలు సంతృప్తిగా ఉన్నారన్నారు. జగన్‌ను సీఎం చేసుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల ఏర్పాటుతో గ్రామాల్లోనే సమస్యలు పరిష్కారం అవుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు అచ్చుకట్ల కరీముల్లా, తుడుమలదిన్నె సర్పంచ్ కృష్ణారెడ్డి, అగ్రహారం సొసైటీ అధ్యక్షుడు రాఘవరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి, కూనవారిపల్లె సర్పంచ్ సుబ్బారెడ్డి, అమరేశ్వర్‌రెడ్డి, నాగసుబ్బారెడ్డి, వేమారెడ్డితోపాటు నాయకులు, అధికారలు, వలంటీర్లు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం


సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాగార్జునరెడ్డి

బద్వేలు : ఎన్నో సంవత్సరాలుగా ఉన్న చుక్కల భూములను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ 22 నిషేధిత జాబితా నుండి తొలగించడం హర్షణీయమని ఏపీ పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సలహాదారు నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. శనివారం పోరుమామిళ్ళలోని తన స్వగృహంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో చుక్కల భూములతో నిరుపేదలు 1బి, అడంగల్ రాక ఇబ్బందులు పడుతుండేవారని, ఇప్పుడు జిల్లాలో 22 వేల ఎకరాల చుక్కల భూములకు శాశ్వత పరిష్కారం చూపడంతో రైతులకు ఇబ్బందులు తప్పాయని చెప్పారు. జగనన్న ప్రభుత్వం రైతుల పక్షపాతి అని మరోసారి రుజువు చేసుకున్నారని తెలిపారు. తడిసిన ధాన్యాన్ని గిట్టుబాటు ధరకు రైతుల వద్ద నుండి కొనడం, వారం రోజుల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేయడం జగనన్నకే సాధ్యమన్నారు. ప్రతిపక్షాలు చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్‌లు అపబద్ధపు ప్రచారంతో ప్రభుత్వంపై బురదజల్లే విధంగా చేయడం చూస్తుంటే రైతులు ఎవరూ కూడా నమ్మే స్థితిలో లేరని తెలిపారు. 2024లో కూడా జగనన్నే మళ్ళీ ముఖ్యమంత్రి కావడం తథ్యమని, ప్రజలందరూ కూడా అదే కోరుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో నీటి సంఘం ప్రెసిడెంట్ ఓబన్న, కె.ప్రసాద్, లక్కినేనిఓబయ్య, ఎ.కె.హుస్సేన్‌పీరా, వార్డు మెంబర్ ఓబయ్య, వెంకటసుబ్బయ్య, రమణ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ప్రొద్దుటూరు కల్చరల్ : బ్రాహ్మణ సేవాసంఘం ఆధ్వర్యంలో 10వ తరగతి, ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన బ్రాహ్మణ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందించనున్నట్లు బ్రాహ్మణ సంఘం కార్యదర్శి రంజన్‌శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన ప్రతిభ గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ నెల 17వ తేదీ లోపల తమ దరఖాస్తులను బ్రాహ్మణ సంఘం కార్యాలయంలో తమ వివరాలు, మార్కులిస్టుల కాపీని అందచేయాలని కోరారు. అర్హులైన విద్యార్థులకు ఈనెల 21న బహుమతి ప్రదానోత్సవం ఉంటుందని వివరించారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

రాజుపాళెం : వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా శనివారం విద్యార్థులకు కథలను చెప్పినట్లు గ్రంథాలయ అధికారి ఎస్.ప్రతాపుడు తెలిపారు. ప్రతిరోజు ఈ శిక్షణకు విద్యార్థులు 25 మందికి పైగా హాజరవుతున్నారన్నారు. శిబిరానికి వచ్చే విద్యార్థులకు పరిజ్ఞానం పెరుగుతుందని చెప్పారు.

రేపు పెద్దగురువళూరులో ఫ్యామిలీ డాక్టర్

చాపాడు : మండలంలోని నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పెద్దగురువళూరు గ్రామ సచివాలయం వద్ద సోమవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్ కుమార్ తెలిపారు. గ్రామంలో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగే వైద్య శిబిరంలో అన్ని రకాల వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలని వైద్యాధికారి కోరారు.

హనుమత్ జయంతికి ఏర్పాట్లు పూర్తి

ప్రొద్దుటూరు కల్చరల్ : మండల పరిధి నరసింహపురంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం హనుమత్ జయంతిని చిన్మయమిషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నట్లు బ్రహ్మచారిణి మాతాజీ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం హనుమత్ విగ్రహానికి విశేష పూజలతోపాటు హనుమాన్ చాలీసా పారాయణం, 27 హోమగుండాలలో 108 మంది దంపతులతో హనుమత్ హోమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

ప్రొద్దుటూరు : మండల పరిధిలోని కానపల్లె గ్రామంలో ఆదివారం హనుమత్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు కొత్తపల్లె గ్రామ పంచాయతీ సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని, మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఆంజనేయస్వామి గ్రామోత్సవం ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

చాపాడు : మండల పరిధిలోని చాపాడు, తిప్పిరెడ్డిపల్లెలో ఆదివారం, విశ్వనాథపురం గ్రామంలో ఆది, సోమవారాల్లో హనుమన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా రెండు గ్రామాల్లోని వీరాంజనేయ స్వామి దేవస్థానాల వద్ద ఉత్సవ నిర్వహణ ఏర్పాట్లను పూర్తి చేశారు. చాపాడు, తిప్పిరెడ్డిపల్లె గ్రామాల్లో ఆదివారం ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచనం, కలశ స్థాపన చేయనున్నారు. తిప్పిరెడ్డిపల్లెలో చిన్నపాటిగా ఉన్న గుడిని విస్తరణ చేసి నిర్మించారు. గుడి నిర్మాణానికి సీతంపల్లెకు చెందిన తడిసిరి లక్షుమయ్య జ్ఞాపకార్థం కుమారుడు మురళీమోహన్ యాదవ్, జ్యోత్స్న దంపతులు రూ.6 లక్షలతో పనులను జరిపారు. కూచిపూడి, జానపద నృత్య ప్రదర్శన, చెక్కభజన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

విశ్వనాథపురంలో బండలాగుడు పోటీలు..

విశ్వనాథపురం వీరాంజనేయ స్వామి సన్నిధిలో హనుమన్ జయంతి సందర్భంగా సోమవారం బండలాగుడు పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి రూ.60వేలు, రూ.50వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేలు చొప్పున నగదు బహుమతులను ఇవ్వనున్నారు.

కలసపాడు : మండలంలోని మహానందిపల్లె గ్రామంలో వెలసిన శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో, పాత రామాపురం ఆంజనేయస్వామి, సిద్ధమూర్తిపల్లెలో వెలసిన అభయాంజనేయస్వామి ఆలయాల్లో ఆదివారం హనుమాన్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. హనుమాన్ జయంతి సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు. మహానందిపల్లెలో లింగారెడ్డిపల్లెకు చెందిన కొత్తపల్లెరంగారెడ్డి భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. హనుమాన్ జయంతి వేడుకల్లో భక్తులు పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

సీఎంను విమర్శించే స్థాయి పవన్‌కల్యాణ్‌కు లేదు

కడప కార్పొరేషన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే స్థాయి పవన్‌కల్యాణ్‌కు లేదని చింతకొమ్మదిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి అన్నారు. శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పవన్‌కల్యాణ్ తీరు జనసేన కార్యకర్తలనే అయోమయానికి గురిచేసేలా ఉందన్నారు. రోజుకో మాట, గంటకో మాట, నిముషానికి ఒకలా ప్రవర్తిస్తున్నాడని ఎద్దేవా చేశారు. ఎవరైనా ఎన్నికల సమయంలో పొత్తులు పెట్టుకుంటారని, ఈయన ఎన్నికలు రాకముందే పొత్తులకు తహతహలాడుతున్నాడన్నారు. ఎన్నికల్లో పొత్తు ఉంటుంది అంటూనే మళ్లీ దానికి విధి విధానాలు తయారు కాలేదని చెప్పడం విచిత్రంగా ఉందన్నారు. ప్యాకేజీ ఇంకా ఖరారు కానందునే పొత్తుపై విధివిధానాలు తయారు కాలేదని చెబుతున్నాడని ఎద్దేవా చేశారు. జనసేన పార్టీ కోసం పనిచేస్తున్న కార్యకర్తల మనోభావాలు పరిగణలోకి తీసుకోకుండా, పార్టీని తీసుకుపోయి చంద్రబాబు కాళ్ల వద్ద తాకట్టు పెడుతున్నాడన్నారు. కులానికి, ప్రాంతానికి ముడిపెట్టి రాజకీయాలు చేస్తున్నారన్నారు. స్పందన లేని వాడు నాయకుడు కాలేడని, పవన్ కల్యాణ్ కూడా ఆ కోవలోకే వస్తాడన్నారు.

అటవీ కార్యాలయం వద్ద పరిశుభ్రత పనులు

పోరుమామిళ్ల: పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా శనివారం రేంజర్ వెంకట రమణారెడ్డి ఆధ్వర్యంలో ఫారెస్టు సిబ్బంది పరిశుభ్రత పనులకు శ్రీకారం చుట్టారు. ఆవరణలో ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, బాటిల్లు, చెత్త, పేపర్లు తొలగించారు. ఆవరణ శుభ్రం చేసి, పాదులు తీసి మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని పిలుపిచ్చారు. సెక్షన్ అధికారి శ్రీకృష్ణ, బీటు అధికారులు బాషా, కరుణాకర్, వెంకటేష్, కిశోర్ పాల్గొన్నారు.

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

రిజిస్టర్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండీ, చెన్నై - 600032, వెబ్‌సైట్: www.shriramfinance.in, బ్రాంచ్ కార్యాలయము: పి.ఎం.ఆర్.కాంప్లెక్స్, మెయిన్‌రోడ్డు, రైల్వే కోడూరు, అన్నమయ్య జిల్లా

లాంఛనంగా స్వాధీనతా ప్రకటన

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా ఉండి శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్‌తో విలీనమైన తరువాత ఎన్‌సీఎల్‌టీ బెంచ్-2 చెన్నై తేది: 09.11.2022వారి ఆదేశాలతో శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ గా రూపాంతరం చెందిన తర్వాత కార్పొరేట్ ఫైనాన్స్ మంత్రిత్వ శాఖ లేఖ తేది: 30.11.2022 ద్వారా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పేరు మార్పునకు ఆమోదము లభించినది) ఈ కంపెనీ కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిస్టరు కాబడినది మరియు ఆర్‌బిఐ నందు కూడా నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ వ్యాపార కార్యకలాపాలు నిర్వహించుటకు రిజిస్టరు కాబడి వారి రిజిస్టరు కార్యాలయం: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండీ, చెన్నై - 600032 నందు సమోదు కాబడినదని తెలియజేయడమైనది. బ్రాంచ్ కార్యాలయము: రైల్వే కోడూరు

సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002(యాక్ట్ 54 ఆఫ్ 2002) ప్రకారం శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (యస్‌యఫ్‌యల్) యొక్క అధీకృత అధికారి సదరు చట్టంలోని 13(12) కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 నందలి రూలు 3 ప్రకారం సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ ఋణగ్రహీ ఈ క్రింది తెలిపిన ప్రకారం బకాయి సొమ్ము మొత్తంను చెల్లించవలసినదిగా క్రింద ఉదహరించబడిన తేదీన డిమాండ్ నోటీసు జారీ చేయడమైనది.

బకాయి సొమ్ము చెల్లించడంలో ఋణగ్రహీతలు విఫలమైనందున సదరు చట్టంలోని సెక్షన్ 13(4)తో అనుబంధమైన సదరు రూల్స్ నందలి రూలు 8 ప్రకారం సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ దిగువ పేర్కొన్న ఆస్తిని ది.09.05.2023నలాంఛనంగా స్వాధీనం చేసుకోవడమైనదని ఋణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేడమైనది.

ఋణగ్రహీత పేరు మరియు చిరునామా:
1) ఎం.లింగారెడ్డి, (మాజీ ఎమ్మెల్యే) తండ్రి ఓబులిరెడ్డి, డి.నెం.3/135, ప్రకాష్‌నగర్, వైఎంఆర్ కాలనీ, ప్రొద్దుటూరు, కడప జిల్లా
2) ఎం.లక్ష్మీప్రసన్న భర్త లింగారెడ్డి (మాజీ ఎమ్మెల్యే), డి.నెం.3/135, ప్రకాష్‌నగర్, వైఎంఆర్ కాలనీ, ప్రొద్దుటూరు, కడప జిల్లా
3) ఎం.లక్ష్మీతనూజ తండ్రి ఎం.లింగారెడ్డి (మాజీ ఎమ్మెల్యే), డి.నెం.3/135, ప్రకాష్‌నగర్, వైఎంఆర్ కాలనీ, ప్రొద్దుటూరు, కడప జిల్లా

డిమాండ్ నోటీసు ప్రకారం బకాయి సొమ్ము: రూ.6,56,38,094/- (ఆరు కోట్ల యాభై ఆరు లక్షల ముప్పై ఎనిమిది వేల తొంభై నాలుగు రూపాయలు మాత్రమే)
ఋణ ఖాతా నెంబరు : KODR2TF1203310004
డిమాండ్ నోటీసు తేది: 23.01.2023

స్థిరాస్తుల వివరములు:-

షెడ్యూలు-ఎ:- కడప జిల్లా, ప్రొద్దుటూరు సబ్ జిల్లా, ప్రొద్దుటూరు మండలం, ప్రొద్దుటూరు టౌన్ మరియు ప్రొద్దుటూరు మున్సిపాలిటీ వార్డునెం.3, సర్వేనెం.315/1, ప్రకాష్ నగర్ వీధి, డోర్‌నెం.3/135 గల ఆర్.సి.సి. బిల్డింగ్ హద్దులు: తూర్పు: లింగారెడ్డి ఆస్తి, పడమర: రోడ్డు, ఉత్తరం: ఎం.పాపిరెడ్డి బిల్డింగ్, దక్షిణం: టి.లక్ష్మిరెడ్డి ఇల్లు, ఈ హద్దులమధ్య తూర్పు నుండి పడమర: 64అ. లేదా 19.507మీ. ఉత్తరం నుండి దక్షిణం: 25 1/2 అ. లేదా 7.772మీ. వెరశి మొత్తం 181.33చ.గ. ఇందున వున్న ఆర్.సి.సి. బిల్డింగుకు కొలతలు: తూర్పు నుండి పడమర:53అ. లేదా 16.154 మీ. ఉత్తరం నుండి దక్షిణం: 16 1/2 అ. లేదా 5.029మీ. వెరశి 874.5చ.అ. అన్ని ద్వారములు, ద్వారబంధనములు, కిటికీలు తదితరాలతో సహా.

షెడ్యూలు-బి:- కడప జిల్లా, ప్రొద్దుటూరు సబ్ జిల్లా, ప్రొద్దుటూరు మండలం, ప్రొద్దుటూరు టౌన్ మరియు ప్రొద్దుటూరు మున్సిపాలిటీ వార్డునెం.3, ప్రకాష్ నగర్ వీధి, ప్రొద్దుటూరు గ్రామ ఫీల్డ్ సర్వేనెం.315 లోని భూమి విస్తీర్ణం ఎ.3.42 1/2 సెంట్లలో ఎ.0.01 సెంట్లు లేదా 0.15చ.లింకులు లేదా 0.004 హెక్టార్లు హద్దులు: తూర్పు: లింగారెడ్డి ఆస్తి, పడమర: డి.నెం.3/135 లింగారెడ్డి గల ఇల్లు, ఉత్తరం: చంద్ర ఓబులిరెడ్డి స్థలం, దక్షిణం: టి.లక్ష్మిరెడ్డి ఇల్లు, డి.నెం.3/136. ఈహద్దుల మధ్య తూర్పు నుండి పడమర: 15అ. లేదా 4.575మీ. ఉత్తరం నుండి దక్షిణం: 29 1/2 అ. లేదా 8.997మీ. వెరశి 49.16 చ.గ. స్థలం

షెడ్యూలు- సి:- కడప జిల్లా, ప్రొద్దుటూరు సబ్ జిల్లా, ప్రొద్దుటూరు మండలం, ప్రొద్దుటూరు టౌన్ మరియు ప్రొద్దుటూరు మున్సిపాలిటీ వార్డునెం.3, ప్రకాష్ నగర్ వీధి, ప్రొద్దుటూరు గ్రామ ఫీల్డ్ సర్వేనెం.315 లోని భూమి విస్తీర్ణం ఎ.3.42 1/2 సెంట్లలో ఎ.0.03 సెంట్లు లేదా 385 చ.లింకులు లేదా 0.013హెక్టార్లు హద్దులు: తూర్పు: రోడ్డు పడమర: లింగారెడ్డి ఇల్లు ఉత్తరం: చంద్ర ఓబులిరెడ్డి స్థలం, దక్షిణం: టి.లక్ష్మిరెడ్డి ఇల్లు, డి.నెం.3/136. ఈహద్దుల మధ్య తూర్పు నుండి పడమర: 50అ. లేదా 15.250మీ. ఉత్తరం నుండి దక్షిణం: 29 1/2 అ. లేదా 8.997మీ. వెరశి 163.88 చ.గ. స్థలం

సాధారణ ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా (యస్‌యఫ్‌యల్) అధీకృత అధికారి పైన పేర్కొబడిన స్థిరాస్తులను ఋణగ్రహీతల నుండి లాంఛనముగా స్వాధీనత తీసుకొనడమైనది. ఈ నోటీసు తర్వాత ఏ వ్యక్తికి విక్రయించుట గాని, ట్రాన్స్‌ఫర్ చేయుట గాని, లీజు లేదా తనఖా ఆస్తులను దార మళ్ళించుటకు గానీ యస్‌యఫ్‌యల్ వారి లిఖితపూర్వక అనుమతి లేకుండా చేయరాదు.

తేది: 09.05.2023
ప్రదేశం:కడప / జెడ్.ఓ.

సం/- అధీకృత అధికారి,
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్